రేపు జాజుల శ్రీనివాస్‌గౌడ్ రాక

నిజామాబాద్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన చైతన్య యాత్రలో భాగంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ గురువారం నగరానికి రానున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తెలిపారు. ఈనెల 21న 11 గంటలకు జిల్లా కేంద్రంలోని కేర్ కళాశాలలో నిర్వహించే కులగణన చైతన్య సదస్సును అన్ని కులాల నాయకులతో నిర్వహించనున్నట్లు ఈ సదస్సులో అన్ని బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నేడు ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమం

నిజామాబాద్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రజా విజయోత్సవ సంబరాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సాయంత్రం 6గంటలకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే అట్టహాసంగా ప్రజాకళా యాత్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం రాజీవ్‌గాంధీ ఆడిటోరియంను సందర్శించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఆయా శాఖల వారిగా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. రాష్ట్రస్థాయి కళాకారుల బృందం హాజరవుతున్న నేపథ్యంలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తెలంగాణ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అంతడ్పుల నాగరాజు బృందం ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, వేదికను అందంగా, ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేయాలని అతిథులు, ఆహుతుల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. కలెక్టర్ వెంట ఆర్‌డీవో రాజేంద్రకుమార్, నగర పాలక కమిషనర్ దిలీప్‌కుమార్, డీపీఆర్‌వో పద్మశ్రీ, తహసీల్దార్ బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో గడుగు గంగాధర్



వేదికపై డిప్యూటీ సీఎం, టీపీసీసీ చీఫ్, గడుగు గంగాధర్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఇందిరాగాంధీ వ్యవసాయ ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చితే భూసారం తగ్గుతుంది

- జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్

ఎడపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరి కోతల అనంతరం రైతులు వరి కొయ్యలను కాల్చితే భూసారం తగ్గుతుందని కొయ్యలను భూమిలోనే కలియదున్నాలని జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ.. రైతులు వరి కొయ్యలు కాల్చకుండా భూమిలో కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిద్ది రామేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర సర్వే

ఇప్పటి వరకు 77.77 శాతం పూర్తి





- నగరంలో...

- సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్న ఎన్యూమరేటర్లు
- ఆస్తులు, వాహనాలు, పథకాలకు సంబంధించిన వివరాలను అందించేందుకు వెనకడుగు వేస్తున్న కొందరు
- సర్వేపై పూర్తి అవగాహన కల్పిస్తున్న అధికారులు
- జిల్లాలో మరో ఐదు రోజుల్లో పూర్తికానున్న సర్వే

నిజామాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వే జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. ఎన్యూమరేటర్లు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో ఈనెల 9న సర్వే ప్రారంభించగా.. ఇప్పటి వరకు 77.77శాతం వరకు సర్వే పూర్తి చేశారు. మరో ఐదు రోజుల్లో సర్వేను పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్వే వివరాలను ఏ రోజుకు ఆరోజు ఎన్యూమరేటర్లు సూపర్‌వైజర్ల ద్వారా ఆయా మండల కేంద్రాల్లో



కోమన్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



నగరంలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు

అందిస్తున్నారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో వీటిని భద్రపరుస్తున్నా రు. జిల్లా వ్యాప్తంగా ప్రతీరోజు సుమారు 40వేల ఇళ్ల వరకు సర్వేను కొనసాగిస్తు న్నారు.

జిల్లాలో 4,69,988 గృహాలు

జిల్లాలో మొత్తం 4లక్షల 69వేల 988 గృహా లు ఉన్నాయి. వీటి కోసం మొత్తం 3,453 ఎన్యూమరేటర్ బ్లాక్‌లను గుర్తించారు. ఒక్కొక్క బ్లాక్‌కు ఒక్కొక్క ఎన్యూమరేటర్ పేరు మీద 3,453 మందిని నియమించారు. వీరితో పాటు పది మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. మొత్తం 358 సూపర్‌వైజర్లను నియమించి సర్వేను కొనసాగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసేందుకు ఒక్కొక్క ఎన్యూమరేటర్‌కు 150 నుంచి 175 ఇళ్ల వరకు కేటాయించారు. ఈ సర్వేను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయి అధికారులను మండలాలకు నోడల్ అధికారులుగా నియమించారు. వీరితో పాటు ఎంపీడీవోలు, తహసీల్దార్లను పర్యవేక్షించే విధంగా ఆదేశాలను ఇచ్చారు. డివిజన్ స్థాయిలో ఆర్‌డీవోలు పర్యవేక్షిస్తూ సర్వేను కొనసాగిస్తున్నారు.

వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు : కలెక్టర్

జిల్లాలో సర్వేను వంద శాతం పూర్తి చేసే విధంగా చర్యలను చేపట్టామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ప్రతీరోజు వారికి కేటాయించిన ఇళ్లల్లో పూర్తి వివరాలు తెలుసుకునే విధంగా చూస్తున్నామన్నారు. వాటిని సూపర్‌వైజర్లు పరిశీలించడంతో పాటు వివరాలు సేకరించుకునే విధంగా చూస్తున్నామని తెలిపారు. జిల్లాలో మరో ఐదు రోజుల్లో సర్వే పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు.

వివరాలు అందించేందుకు వెనకడుగు

జిల్లాలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నా.. కొంత మంది స్పందించడం లేదు. పూర్తి వివరాలను అందించేందుకు నిరాకరిస్తున్నారు. సర్వేలో భాగంగా 74 అంశాలకు సంబంధించిన వివరాలలో కొన్నింటిని అందించడం లేదు. భూములు, వాహనాలు, ఇళ్లు, సంక్షేమ పథకాలకు సంబంధించి కొంత మంది సమాచారం ఇస్తుండగా.. మరికొంత మంది నిరాకరిస్తున్నారు. ఆధార్, భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు ఇస్తున్న కుటుంబ యజమానులు ఇళ్లు, ప్లాట్లకు సంబంధించిన వివరాలను అందించడం లేదు. వాహనాలకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారాన్ని అందించడం లేదు. రైతులు వ్యవసాయ భూములకు సంబంధించిన వివరాలు అందిస్తుండగా, వ్యాపారులు, ఉద్యోగులు మాత్రం వారికి ఉన్న భూములు, ఇండ్లు, ప్లాట్లకు సంబంధించిన పూర్తిస్థాయి వివరాలను ఇవ్వడం లేదు. ఇంట్లో ఇద్దరు లేదా ముగ్గురు ప్రైవేటు ఉద్యోగాలు చేస్తే ఒక్కరికి సంబంధించిన వివరాలనే అందిస్తున్నారు. రైతుబంధు, రైతుబీమా, రుణ మాఫీ, పెన్షన్‌కు సంబంధించిన వివరాలు అందిస్తున్నా.. ఇతర వివరాలను మాత్రం ఇవ్వడం లేదు. విదేశాలకు వెళ్లిన విద్యార్థుల వివరాలను కూడా పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు. గల్ఫ్, ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నా.. ఇక్కడే ఉన్నట్లు వివరాలను అందిస్తున్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, డబుల్ బెడ్‌రూం, దళితబంధు వంటి పథకాలు లబ్ధిపొందిన వారిలో ఎక్కువగా వివరాలను అందించడం లేదు. కులానికి సంబంధించిన వివరాలు అందిస్తున్న వారు ప్రజాప్రతినిధులుగా పనిచేస్తే ఆ

మిగతా 8వ పేజీలో...

బీఆర్‌ఎస్‌పై.. పీసీసీ అధ్యక్షుడి అడ్డగోలు మాటలు

- కాంగ్రెస్‌లోని కుమ్ములాటలను పట్టించుకోని పీసీసీ చీఫ్
- ఏ హామీని నెరవేర్చని సీఎం రేవంత్‌రెడ్డి
- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌పై టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికలలోపు బీఆర్‌ఎస్ ఖాళీ అవుతుందని మహేష్‌కుమార్‌గౌడ్ ఇష్టం వచ్చినట్లుగా ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. సొంత కాంగ్రెస్ పార్టీలో కుమ్ములాటలను పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పదకొండు నెలల్లోనే ఆ పార్టీని ప్రజలు చీదరించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి చెందిన సర్వేలో కూడా ఇదే విషయం బయటపడిందని ఆయన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇస్తామని 2004లో ఒప్పందం చేసుకొని 2014 వరకు పొడిగించిందని ఆయన ఆరోపించారు. పార్టీ నేత హరీష్‌రావు పార్టీ మారుతారని ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు. 30ఏళ్లుగా కేటీఆర్, హరీష్‌రావులు కలిసే పని చేస్తున్నారని ఆయన అన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ఉండగానే ఇద్దరు ముగ్గురు మంత్రులు ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఒకదిక్కు పొంగులేటి.. మరో దిక్కు శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్కలు సీఎం కుర్చీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన అన్నారు. వరంగల్‌లో బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన కాళోజీ భవనానికే ఆయన రిబ్బన్ కట్ చేస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సీఎం పని చేయకుండా సెక్రెటేరియెట్ గేట్లను మారు స్తున్నారని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు తాను ఛాలెంజ్ చేస్తున్నానని ఇష్టం వచ్చిన ఊరు ఎన్నుకుంటే తాను అక్కడికి వస్తానని అన్నారు. ఆ ఊరు సెంటర్‌లో నిలబడి రైతులకు రుణ మాఫీ అయిందని.. రైతుబంధు వచ్చిందని.. వడ్ల బోనస్ వచ్చిందని.. పెన్షన్ వచ్చిందని చెబితే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఆయన ప్రకటించారు. చేయలేదు అని ప్రజలు చెబితే పీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తాడా? అని మహేష్ కుమార్‌గౌడ్‌ను ఆయన ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే పది నెలల్లోనే విధ్వంసం చేశాడని విమర్శించారు. సంవత్సరంలో ఏ పనులు చేశారని వరంగల్‌లో విజయోత్సవ సభ చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి కూడా అమలు కావడం లేదని ఆయన విమర్శించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్త, జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దండు శేఖర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

బీఆర్‌ఎస్ నేత దండు శేఖర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. దాడి వెనక కాంగ్రెస్ హస్తం ఉందనే అనుమానాలు ఉన్నాయని అన్నారు. లోతైన దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడే విధంగా చూడాలని ఆయన కోరారు.



ఆసుపత్రిలో శేఖర్‌ను పరామర్శిస్తున్న ప్రశాంత్‌రెడ్డి



రైతుల ఖాతాల్లో బోనస్!

- కామారెడ్డి జిల్లాలో 1240 మంది రైతులకు రూ.4.50 కోట్ల బోనస్ చెల్లింపులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

కామారెడ్డి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులను జమచేస్తోంది. సన్న రకం వడ్లకు క్వింటా రూ.500 చొప్పున అధికారులు జమచేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి క్వింటా సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 చొప్పున రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు వేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 1240 మంది రైతుల ఖాతాలో సన్న రకం ధన్యానికి సంబంధించి రూ.4.50 కోట్ల బోనస్ చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2,33,423 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు.

2.80లక్షల మెట్రిక్ టన్నుల్లో సన్నాల దిగుబడులు

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఈ వానాకాలం సీజన్‌లో వేల ఎకరాలలో రైతులు సన్నరకం ధాన్యాన్ని సాగుచేశారు. ఈ సీజన్‌లో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 3,15,457 ఎకరాలల్లో వరి పంట సాగైంది. ఇందులో 2,18,830 ఎకరాలల్లో దొడ్డురకం సాగు కాగా 4.01 లక్షల మెట్రిక్ టన్నులలో దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. ఇందులో 4లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు రావచ్చని అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా 98,620 ఎకరాలల్లో సన్నరకం ధాన్యాన్ని రైతులు సాగుచేశారు. ఇందులో 2.80లక్షల మెట్రిక్ టన్నుల సన్నల దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. రైతుల అవసరాలు, బయట మార్కెట్‌లో విక్రయాలు పోను కొనుగోలు కేంద్రాలకు 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

కొనుగోలు కేంద్రాలలో సన్నరకం ధాన్యాన్ని విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ డబ్బులు అదనంగా పడుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1240 మంది రైతుల ఖాతాలో సన్నధాన్యంకు సంబంధించి రూ.4.50 కోట్ల బోనస్ చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. కేంద్రాలలో విక్రయించిన ధాన్యం సొమ్ముతో పాటే బోనస్ సొమ్మును చెల్లించకపోవడంతో కొందరు రైతులు ఆందోళన చెందుతూ వచ్చారు. ఈ క్రమంలో ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందా ? లేదా? అనే చర్చ సాగింది. ప్రతిపక్షాలు సైతం రైతులకు ఇస్తామన్న బోనస్ సొమ్ము ఇవ్వడం లేదని విమర్శలు గుప్పించాయి. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధర డబ్బులతో పాటు బోనస్ చెల్లిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రైతులకు రాయితీపై యంత్రాలు

- సబ్సిడీపై వ్యవసాయ ఉపకరణాలు అందజేయాలని ప్రతిపాదన
- ఐదేళ్లుగా రాయితీ యంత్రాలు అందలేదంటున్న రైతులు
- మంత్రి ప్రకటనతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

7

ఘనంగా అంగారిక గణపతి పూజలు

- ఆలయాల్లో సామూహిక అర్చనలు
- గణపతి హోమాలు, అన్నదానాలు



వారంలోగా రైతులకు రూ.500 బోనస్



తాళ్లరాంపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అన్వేష్ రెడ్డి

ఏర్గట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్నలకు క్వింటాళుకు ఐదు వందల బోనస్ వారం రోజుల్లోగా రైతులకు అందజేస్తామని రాష్ట్ర విత్తనాభివృద్ధి చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ ఖేత్ అధ్యక్షుడు సుంకేట అన్వేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వరికి క్వింటాళుకు ఐదు నుండి ఎనిమిది కిలోల వరకు కడ్తా తీసుకొని రైతులను మోసం చేశారని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి కడ్తా లేకుండా వడ్లను తీసుకున్న నాలుగు ఐదు రోజుల్లో డబ్బులు జమ చేస్తుందని అన్నారు. రైతు భరోసా డబ్బులు మిగిలిన రైతులకు బడ్జెట్ ప్రకారం రైతు ఖాతాల్లో జమ కావడం ఖాయమని రైతులు ఎవ్వరూ అధైర్యపడోద్దని అన్నారు. ఇట్టి కార్యాక్రమంలో సొసైటీ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ కొట్టాల శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, బద్ధం లింగారెడ్డి, ముస్కు మోహన్, వెంకట్ రెడ్డి, శాంసన్, దేశబోయిన చిన్న సంజీవ్‌లు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో మెహందీ పోటీలు



మెహందీ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థినిలకు మెహందీ పోటీలు నిర్వహించారు. పోటీలో పాల్గొన్న విద్యార్థినిలు రకరకాల నమూనాలో మెహందీ వేశారు. మెహందీ పోటీలకు న్యాయనిర్ణేతలుగా అపర్ణ, యశోదాలు వ్యవహరించారు. అనంతరం విద్యార్థులు తమ తమ మెహందీలను న్యాయమూర్తులకు చూపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్స్ షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు, నాలుగు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్స్ షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి, శివకుమార్, సాయి కుమార్ పాల్గొన్నారు.

100 కాల్‌ను దుర్వినియోగంపై ఒక రోజు జైలు

బోధన్‌రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో వినియోగించే డయల్ 100కాల్‌ను దుర్వినియోగం చేసిన వ్యక్తికి బోధన్ కోర్టు న్యాయమూర్తి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ప్రజలు అత్యవసర సమయాల్లో వినియోగించే డయల్ 100 కాల్‌ను దుర్వినియోగం చేయవద్దన్నారు.

26న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన

డిచ్‌పల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న తీరుకు నిరసన గా ఈ నెల 26న జరిగే ఆందోళనలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనలని అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షుడు ఆకుల పాపయ్య కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భూమయ్య, సాయినాథ్, దేవస్వామి, పాల్గొన్నారు.

సిరికొండ: కేంద్రంలో అధికారంలో కొనసా గుతున్న బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వం తన వ్యవసాయ విధానాన్ని మార్చు కోకుండా కార్పోరేట్ శక్తులకు అనుకూలంగానే నిర్ణయాలను చేస్తోందని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ అన్నారు. ఈ సమావేశంలో ఏఐపీకెఎంఎస్ రాఢు అధ్యక్షులు రామకృష్ణ, దామోదర్, రమేష్,లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

చాకుతో యువకుడిపై దాడి

నవీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్ బర్కత్‌పుర కాలనీకి చెందిన షేక్ సోహెల్ అనే యువకుడిపై అదే కాలనీకి చెందిన షేక్ గౌస్ అనే యువకుడు ఈ నెల 18న రాత్రి చాకుతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. నాలుగు నెలల క్రితం షేక్ గౌస్ సోదరుడి పుట్టిన రోజు సందర్భంగా కాలనీలో పెద్ద సౌండ్‌తో పాటలు పెట్టగా షేక్ సోహెల్ సౌండ్ తగ్గించామని కోరడంతో పాటు పోలీసులకు సమాచారం అందించారని అన్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న షేక్ గౌస్ ఈ నెల 18న రాత్రి సమయంలో షేక్ సోహెల్ పొట్టలో చాకుతో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయని వెంటనే అతనిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించడం జరిగిందని అన్నారు. బాధితుడు షేక్ సోహెల్ మేనమామ షేక్ రజియొద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాల్య వివాహం జరిపిన కుటుంబాలపై పోలీసులకు ఫిర్యాదు

ఖిల్లా, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలికను వివాహం చేసుకున్న వ్యక్తిపై ఐసీడీఎస్ అధికారులు నగరంలోని మూడవ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 17న జరగగా సమాచారం అందుకున్న ఐసిడిఎస్ అధికారులు బాల్య వివాహం చేసిన ఇరు కుటుంబాలపై నగరంలోని మూడవ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడవ టౌన్ ఎస్‌ఐ మహేష్ బాలికను వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఇరు కుటుంబాలను విచారిస్తున్నట్లు తెలిపారు.

సమగ్ర సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి



పొతంగల్ జీపీలో అధికారులతో మాట్లాడుతున్న బోధన్ సబ్ కలెక్టర్

కోటగిరి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. పొతంగల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తీరుపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకు ఎంత మేర సర్వే పూర్తయిందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి మండలంలో 88శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు వివరించారు. బోధన్ డివిజన్‌లో ఉమ్మడి కోటగిరి మండలం ముందంజలో ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన పొతంగల్ జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సిలబస్ ప్రకారం బోధన కొనసాగించాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీవో చందర్, ఎంఈవో శంకర్, హెచ్ఎం సాయిలు ఉన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాలలో కొనసాగు తున్న సమగ్ర కుటుంబ సర్వేను మంగళవారం అధికారులు తనిఖీ చేశారు. కోమన్‌పల్లి గ్రామంలో సమగ్ర కుటుంబసర్వేను ఎంఈవో రాజగంగారాం తనిఖీ చేశారు. సర్వేలో ఇంటి యాజమాని కుటుంబసభ్యుల పూర్తి వివరాలను సేకరించాలని, ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఎన్యుమారేటర్‌లకు సూచించారు. సుర్బిర్యాల్, కోమన్‌పల్లిలో ఇదీ వరకు రూ.523 కుటుంబాలకు గాను 489 కుటుంబాలను సర్వే పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీకార్య దర్శి నవీన్, ఎన్యుమారేటర్లు రమేష్, జ్యోతి, కారోబార్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని 36వార్డులలో కుటుంబ సమగ్ర సర్వే కొనసాగుతుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య ప్రజలు సర్వేకు పూర్తి సమాచారం అందించాలని కోరారు. 70శాతం సర్వే పూర్తయ్యిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమారేటర్ అశోక్, సీవో షబాజ్, షైమద్, బిల్‌కలెక్టర్ దినేష్, సబీర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



వేల్పూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు



మోర్తాడ్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్, మండల అధ్యక్షుడు నర్సారెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌రెడ్డి సహకారంతో వివిధ గ్రామాలకు చెందిన 20మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం మంజూరయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు చేయూతనందిస్తుందన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలంలోని తొర్తి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరి అయిన 20 వేల చెక్కును మంగళవారం గ్రామానికి చెందిన అడ్వాల పెద్ద గంగాధర్ కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఆపద కాలంలో చెక్కు మంజూరీ చేయించిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు కౌడ భూమేశ్వర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి, వేంపల్లి గ్రామాల్లోని ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.లక్ష 78వేల500 చెక్కులను మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ చెక్కులను మంజూరు చేయడానికి కృషి చేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందరవి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దంసాగర్, నర్సారెడ్డి, కిశోర్, తిరుపతిరెడ్డి, రాజారెడ్డి, లక్ష్మణ్, శంకర్, దేవాగౌడ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండల కేంద్రంలో మంగళవారం బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, వీడీసీ అధ్యక్షుడు జక్కం అశోక్, లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుప్పాల అశోక్, మహిపాల్, గిర్మాజీ గంగాధర్, జైడి చిన్న గంగారాం, శ్రీధర్, జక్కం అశోక్, కుదురుపాక ప్రవీన్, కడపాటి రాజేశ్వర్; తక్కురి సతీష్, కడపాటి రమేష్, గురువయ్య, విక్రంగౌడ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలలో బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన బాధితుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. మండంలోని కమ్మర్‌పల్లిలో ఎడుగురికి, ఉప్లూర్, నాగాపూర్ గ్రామాల్లో ఇద్దరు చొప్పున, కోనాసమందర్‌లో ఐదుమంది, నర్సాపూర్‌లలో నలుగురు, బషీరాబాద్‌చౌటపల్లి గ్రామాల్లో ముగ్గురుచొప్పున, హసాకొత్తూర్‌లో నలుగురికి, కోనాపూర్‌గ్రామంలో ముగ్గురురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట శ్రీనివాస్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు బుచ్చిమల్లయ్య, నిమ్మ ప్రసాద్, ప్రదీప్, శేఖర్, దూలూర్ కిషన్‌గౌడ్, దేవేందర్, రవిందర్, రాజేశ్వర్, తిప్పిరెడ్డి శ్రీనివాస్ పాలెపు రాజేశ్వర్, అశోక్, నల్లగణేష్, సాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

టీయూలో గ్లోబల్ ఇంటర్ ప్రెన్యూర్ షిప్ -2024 కార్యక్రమం

డిచ్‌పల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):తెలంగాణ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ డిపార్టుమెంట్ విద్యార్థులు మంగళవారం గ్లోబల్ ఇంటర్ ప్రెన్యూర్ షిప్ 2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీయూ రిజిస్ట్రార్ యాదగిరి హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో విద్యార్థులు నూతన స్కిల్స్ ఎంచుకోవాలని, నూతన ఆలోచనలతో ముందుకు సాగాలని రిజిస్ట్రార్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆంజనేయులు, డా.వాణి, రాజేశ్వరి, అపర్ణ, ఖైసర్, కిరణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే ఫారాల ఆన్‌లైన్ ప్రక్రియకు శిక్షణ

బోధన్‌రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు ఆన్‌లైన్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో పొందుపరుటకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు.. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యూమలేటర్లు తీసుకువచ్చిన ఫారాలను పకడ్బందిగా ఎలాంటి తప్పులు లేకుండా పొందుపర్చే విధానాన్ని శిక్షణ ఇచ్చారు. త్వరలోనే ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, డివిజన్ పరిధిలోని ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నెమళ్లను చంపిన వ్యక్తి అరెస్టు

నవీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్ శివారులో సోమవారం రాత్రి రెండు నెమళ్లను చంపిన శ్రీనివాస్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంజీవ్ గౌడ్ తెలిపారు. సోమవారం రాత్రి గ్రామ శివారులో రెండు నెమళ్లను అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ చంపి వేయగా మంగళవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం రాత్రి కమలాపూర్ శివారులో మృతిచెందిన రెండు నెమళ్లను స్వాధీనం చేసుకున్న విషయం విదితమే.

మార్కెట్ స్థలంలో వేసిన పైపుల తొలగింపు

నవీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ స్థలంలో అక్రమంగా వేసిన పైపులను మంగళవారం తొలగించారు. ఓ కాంప్లెక్స్ భవన యాజమాని పక్కనే ఉన్న పోస్టాఫీస్‌కు చెందిన స్థలంతో పాటు గ్రామ పంచాయతీకి చెందిన స్థలంలో గత శనివారం రాత్రి అక్రమంగా పైపులను ఏర్పాటు చేయగా స్థానికులు అడ్డుకున్న విషయం విదితమే. ఈ విషయంపై అదే రోజు స్థానికులు డీపీవో, ఎంపీవోతో పాటు పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించారు. దీంతో సోమవారం ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌లతో పాటు పోస్టల్ అధికారులు సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. రెండు రోజుల్లో అక్రమంగా వేసిన పైపులను తొలగించాలని లేకపోతే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు హెచ్చరించడంతో మంగళవారం సంబంధిత కాంప్లెక్స్ భవన యాజమాని స్వచ్ఛందంగా పైపులను తొలగించారు.

'ఫార్మాసిటీ కోసం అక్రమంగా భూములను తీసుకోవడం నేరం'

రామారెడ్డి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లోని లగచర్లలో ఫార్మాసిటీ కోసం అక్రమంగా భూములను తీసుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరసిస్తూ రామారెడ్డి మండల కేంద్రంలో బీఆర్ఎస్, గిరిజన నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీలోకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు రవీందర్‌గౌడ్, గిరిజన నేతలు, నాయకులు మాట్లాడారు. లగచర్లలో అక్రమంగా రైతులను, గిరిజనులను అరెస్టు చేసి దాడులు చేసినందుకు బేషరతుగా ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పి అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలని, వెంటనే రైతు రుణాలను రైతులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి నాయక్, గిరిజన నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఉషూ పోటీలకు పిప్రి విద్యార్థిని

ఆర్మూర్‌రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అస్మిత జాతీయస్థాయి ఉషూ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్, వ్యాయమ ఉపాధ్యాయుడు గంగారెడ్డి తెలిపారు. ఇటీవల ముప్కాల్ మండలంలో జరిగిన రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో పిప్రి విద్యార్థులు విష్ణు, వైష్ణవి, అస్మితలు ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన అస్మిత వచ్చేనెల 1వ తేదీ నుంచి పంజాబ్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొనుందన్నారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి యువకుడి మృతి

భీమ్‌గల్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాపూర్ గ్రామంలో మహమ్మద్ ఇస్మాయిల్ (33) అనే యువకుడు కుంటలో పడి చనిపోయాడు. మంగళవారం సాయంత్రం మండలంలోని బాబాపూర్ గ్రామ శివారులో ఉన్న కుంటలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడని ఎస్సై మహేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. భార్య రుక్సన బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికితే పుట్ట గతులుండవు

● మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

బోధన్‌రూరల్,నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికితే పుట్ట గతులు లేకుండా చేస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని బోధన్ తాలూకా రైస్‌మిల్లు అసోసియేషన్ భవన్‌లో సింహ గర్జన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 21న మాలల సింహ గర్జన కార్యక్రమానికి మాలలు తమ ఇళ్లకు తాళం వేసి ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామన్నారు. మాలల ఉప కులాల ఐక్యతను పెంచి వారి హక్కులను సాధించడానికి చైతన్యాన్ని కలిగించేందుకు సింహగర్జన ఒక దార్శనిక వేదికగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగ సంఘాల అధ్యక్షులు అలుక కిషన్, జిల్లా జేఏసీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య, కోకన్వీనర్ వెంకటేశ్వర్లు, నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్, కారం స్వామి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు

● డీపీవో ఉమామహేశ్వర రావు

జక్రాన్‌పల్లి, నవంబరు 19: (ఆంధ్రజ్యోతి) మానవ తప్పిదాలవల్లే రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయని ప్రమాదాలను అరికట్టేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటున్నదని డీపీవో ఉమామహేశ్వర రావు అన్నారు. మంగళవారం రాత్రి జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు, గ్రామపంచాయితీ వద్ద గ్రామస్తులకు పోలీస్ కళాజాతా నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన జమావేశంలో డీవో ఉమామహేశ్వర రావు, ఆర్మూర్ మోటార వెహికిల్ ఇన్స్‌పెక్టర్ వివేకానందరెడ్డి మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, రాంగ్‌రూట్లో వెల్లవద్దని, యూ టర్ను వద్ద జాగ్రత్తగా వెల్లాలని ఫోర్‌విల్లర్ వాహనాదారులు తప్పని సరిగా సీట్ బెల్టులు ధరించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వివరిస్తు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో విడిసి చైర్మన్ మధుసూధన్ రెడ్డి, కోశాధికారి అల్లూరి భాస్కర్ రెడ్డి, సర్పంచ్ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్, ఎస్‌ఐ తిరుపతి, ఏఎస్‌ఐ వెంకట్ కుమార్, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికను బలవంతంగా పెళ్లి చేసుకున్న యువకుడిపై కేసు

జక్రాన్‌పల్లి, నవంబరు 19: (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను బలవంతంగా పెళ్లి చేసుకున్న పడ్కల్ గ్రామానికి చెందిన సందీప్ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. మంగళవారం రాత్రి ఎస్‌ఐ తెలిపిన కథనం ప్రకారం కేసు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఈ నెల 14న బలవంతంగా తీసుకెళ్లి పెళ్లి చేసుకున్న సందీప్‌పై.. ఆయనకు సహకరించిన వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నేత్రాల పరిరక్షణనే ప్రధానం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిజామాబాద్ లీగల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ బార్ అసోసియేషన్ సౌజన్యంతో డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ సమావేశంహాల్‌లో జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత కుంచాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ శరీరంలో కళ్లు ప్రధాన అవయవాలని కంటి చూపుతో విశ్వాన్ని దర్శించుకోవచ్చని ఆమె తెలిపారు. మనిషి మరణానంతరం నేత్రాలను మరో మనిషికి దానం చేసే గొప్ప అవయంగా వైద్య పరిభాషలో పేర్కొంటున్న విషయాన్ని గుర్తు చేశారు. నేత్రదానం వలన మరికొందరు ప్రపంచాన్ని చూడగలుగుతున్నారని ఆమె అన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ సామాజిక దృక్పథంతో వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించడాన్ని జిల్లా జడ్జి ప్రశంసించారు. బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పని ఒత్తిడికి లోనవుతారని దాని వలన కళ్లపైన ప్రభావం పడుతుందని అన్నారు. డాక్టర్ శరత్ జోషి, ఆసుపత్రి ఆప్తమలిస్ట్ విభవ్ చరణ్‌గౌడ్, గణేష్ జంయ్‌లు న్యాయ వాదులు, కోర్టు సిబ్బందికి, కక్షిదారులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు రాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గీతమూర్తిని సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

ముప్కాల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ ప్రభుత్వ పాఠశా లలో 1996-97 పదోతరగతి చదువుతున్న పూర్వవిద్యార్థులు ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. పూర్వ విద్యా ర్థులు బీజేపీ మహిళ మోర్చ రాష్ట్ర తాజామాజీ అధ్యక్షురాలు, బీజేపీ సం స్థాగత ఎన్నికల కో రిటరింగ్ అధికారి గీతమూర్తి పూర్వ విద్యార్థులను కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా చిన్న నాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. ఒకరి నొకరు అప్యా యంగా పలకరించుకొని కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యబోధనలు చేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జి.రంగచారి, ఉపాధ్యాయులు లత, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

రైతు శిక్షణ కేంద్రం నిర్మించడం ప్రశంసనీయం

● ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతు శిక్షణ కేంద్రం, కళ్యాణ మండపం నిర్మించడం పట్ల ప్రశంసనీయమని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం నిజాంసాగర్ మండలం మాగి గ్రామ శివారులో కోటి రూపాయల వ్యయంతో రైతు శిక్షణతో పాటు కళ్యాణ మండపాన్ని నిర్మాణం చేపట్టారు. రైతు శిక్షణ కేంద్రాన్ని జుక్కల్ ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ నిధులతో నిర్మాణం చేసిన కళ్యాణ మండపాన్ని శుభకార్యాలు చేసుకునే వారు వినియోగించుకోవాలని ఆయన అన్నారు. విండోపరంగా రైతులకు నిర్వహించే శిక్షణ తరగతులు సమావేశాలు నిర్వహించుకోనుటకు ఎంతో అనువుగా ఉంటుందని ఆయన అన్నారు. అచ్చంపేట విండో ఆధ్వర్యంలో రైతులకు మరెన్నో సంక్షేమ పథకాలు వస్తే వాటిని వినియోగించుకోవాలని ఆయన అన్నారు. జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ సంఘ నిధులతో రైతు శిక్షణ కేంద్రం కళ్యాణ మండపం నిర్మించడం, ఉమ్మడి జిల్లాలోని ఆదర్శమని ఆయన అన్నారు. సహకార సంఘాలలో రైతులు పొందిన రుణాలను సకాలంలో చెల్లించినట్లయితే వారికి రాయితీ లభిస్తుందని ఆయన అన్నారు. మొట్ట మొదటిసారిగా సహకార సంఘ ప్రతిశిక్షణ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యేను సహకార బ్యాంకు చైర్మన్‌ను విండో పాలకవర్గం పూలమాల శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిట్లం, నిజాంసాగర్ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, అచ్చంపేట విండో అధ్యక్షులు కె.నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు జి.శ్రీనివాస్, మార్కెటింగ్ కమిటీ ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ మురళీధర్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, మహ్మద్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మహ్మద్‌నగర్, అచ్చంపేట, మల్లూరు సహకార సంఘాల ముఖ్య కార్యనిర్వాహణ అధికారులు సంగమేశ్వర్‌గౌడ్, చింతల రాములు, కోటగిరి సాయిలు, విండో డైరెక్టర్లు రైతులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో ప్రజలే పాలకులు

● ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పిట్లం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి: ప్రజా ప్రభుత్వంలో ప్రజలే పాలకులని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ తెలిపారు. మంగళవారం రాజరాజేశ్వర ఫంక్షన్‌హాల్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే పాల్గొన్నారు. నూతన పాలకవర్గానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి రమ్య ఏఎమ్‌సీ అధ్యక్షులుగా మనోజ్‌కుమార్, ఎఎమ్‌సీ వైస్ చైర్మెన్‌గా కృష్ణారెడ్డి, పాలకవర్గ సభ్యులతో ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గరలో అన్ని మండలాలకు గాను 35 వెల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని భద్రపరుచుకోవడానికి మాత్రమే గోదాములు ఉన్నాయని, మరో లక్ష మెట్రిట్ టన్నుల సామర్థం గల గోదాముల ఏర్పరుచుకుంటే రైతులు రోడ్లపై ధాన్యం ఎండబెట్టే పరిస్థితి ఉండదన్నారు. ఈ విషయంపై సంబంధిత మంత్రితో మాట్లాడానని వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, జుక్కల్ నియోజకవర్గ పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు రాంరెడ్డి, హన్మండ్లు, మురళీదర్‌గౌడ్, మొహన్‌రెడ్డి,విండో చైర్మెన్ శపథంరెడ్డి, ఇమ్మురోజ్, అశోక్, మొయిన్, అయా మండలాల మార్కెట్ కమిటీ చైర్మెన్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యం



జిమ్ సెంటర్

యువత దృష్టి

ఫిట్‌నెస్‌పైనే

- సిక్స్‌ప్యాక్ కోసం కుస్తీ పడుతున్న యువకులు
- శరీర ఆకృతులపై ముందు చూపు
- వేదికగా జిమ్ సెంటర్లు

నందిపేట, నవంబరు 19: నేటి ఉరుకులు పరుగుల జీవితంలో ఆరోగ్యంపై కొందరు శ్రద్ధవహించడం లేదు. కొంతమంది యువకులు మాత్రం ఉదయం, సాయంత్రం కొంత సమయాన్ని కేటాయిస్తూ తమ ఆరోగ్యంతో పాటు ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నారు. అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌తో ఉన్న ఫిట్‌నెస్ (జిమ్) సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. పట్టణాల్లోనే కాకుండా పల్లెటూళ్ళలో జిమ్‌లు ఏర్పాటు కావడంతో యువతీ, యువకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మరక్షణ, మనోధైర్యం, ధృడత్వం, ఏదో సాధించాలన్న తపనతో యువకులు శరీర ఆకృతులను పెంచుకుంటున్నారు. మరి కొందరు దించుకుంటున్నారు. అలాగే యువత ఫిట్‌నెస్(జిమ్)పై ఆసక్తి, సుగర్, బీపీ ఉన్న యువకులు శరీర ఆకృతులు మెరుగు పడేందుకు అత్యాధునిక, ఎలక్ట్రానిక్ యంత్రాలతో ఉండే జిమ్ సెంటర్లకు వెళుతున్నారు. జిమ్‌లు అందుబాటులో లేనివారు పట్టణ కేంద్రాలకు రెండు పూటలు వెళ్తున్నారు. కొందరైతే అక్కడే గదులు అద్దెకు తీసుకొని ఉంటున్నారు.

సిక్స్ ప్యాక్ కోసం యువత కసరత్తు

సిక్స్ ప్యాక్, అందమైన శరీరాకృతి కోసం వ్యాయామ శాలలో యువత వివిధ రకాల ఎక్సర్‌సైజ్‌లు చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలతో కుస్తీ పడుతున్నారు. వాక్ మిషన్, వైబ్రేటర్, ఫ్యాట్ మిషన్, చైన్ వెయిట్‌లిఫ్ట్, టీబర్, పాయట్‌కటింగ్, బటర్‌ఫ్లై, డంబుల్స్, థాయిస్ మిషన్, బారు, బ్యాక్‌మిషన్, లోడ్, సైక్లింగ్, బెంచ్‌ప్రెస్, అప్‌డౌన్, పరికరాలతో జిమ్ చేస్తున్నారు. వ్యాయామశాలలో తమను చూసుకుంటూ కసరత్తు చేసేందుకు అద్దాలను అమర్చుకుంటున్నారు. ఇటీవల సిక్స్‌ప్యాక్ బాడీకి ప్రత్యేక క్రేజీ ఉండడంతో దానిపైప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

- సయ్యద్ హుస్సేన్, నందిపేట



మనిషి తన దైనందిన జీవితంలో ఎన్నో సమస్యలతో సతమతమవుతుంటారు. వివిధ రకాల వ్యాధుల బారిన పడకుండా నిత్యం జిమ్, వాకింగ్ మొదలైనవి చేస్తున్నారు. అంతేకాకుండా ఆటలు, సైక్లింగ్, యోగా, మెడిటేషన్, వ్యాయమాలు చేస్తున్నారు. దీని ద్వారా రోగాలను నయం చేసుకుంటున్నారు.



ట్రెడ్‌మిల్స్



- యంత్రం సాయంతో పంట కోస్తున్న దృశ్యం



రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. యాసంగి సీజన్ నుంచి రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, ఉపకరణాలు, యంత్రాలు రాయితీపై సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. గత రాష్ట్ర ప్రభుత్వ పాలనలో ఐదేళ్ల పాటు రాయితీపై వ్యవసాయయంత్రాలు రాక పోవడంతో రైతులకు ఇబ్బందులకు గురయ్యారు.

రైతులకు

రాయితీపై యంత్రాలు!

- సబ్సిడీపై వ్యవసాయ ఉపకరణాలు అందజేయాలని ప్రతిపాదన
- రైతులకు మరింత ప్రయోజనం
- ఐదేళ్లుగా రాయితీ యంత్రాలు అందలేదంటున్నరైతులు
- మంత్రి ప్రకటనతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

ఆర్మూర్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యంత్రీకరణ పథకంలో భాగంగా ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై కల్టివేటర్‌లు, నాగళ్లు, రోటోవేటర్‌లు, బైవాన్ స్ప్రెయార్లు, పవర్‌వీడర్‌లు, ట్రాక్టర్లు, మొక్కజొన్న మొలిచే యంత్రాలు, కిసాన్ డ్రోన్‌లను అందజేసేందుకు ప్రతిపాదించినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఇటీవల ప్రకటించడంపై హర్షం వ్యక్తమవుతోంది.

ఐదేళ్లపాటు అటకెక్కిన పథకం

అన్నిరంగాల్లో మార్పులు వచ్చిన విధంగానే వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. వ్యవసాయంలో రైతులకు సబ్సిడీపై గతంలో అనేక పరికరాలు, యంత్రాలు అందజేసేవారు. దీంతో రైతులు ఎంతో సంతోషించారు. ఆ సంతోషం కాస్త మున్నాళ్ల ముచ్చటైంది. ఆధునిక వ్యవసాయంలో యంత్రాల ప్రవేశంతో వ్యవసాయ రంగానికి మంచి రోజులు వచ్చాయని రైతులు మురిసిపోయారు. కానీ గత కొన్నేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీపై ఎలాంటి యంత్రాలు, పరికరాలు అందజేయడంలేదు. సబ్సిడీపై యంత్రాలు అందజేస్తే వ్యవసాయంలో రైతులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుంది. యంత్రాల వినియోగంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు, తక్కువ సమయంలో పనులు పూర్తి అవ్వడమే గాకుండా వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. గతంతో వ్యవసాయానికి సబ్సిడీ యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అంద జేసింది. రోటోవేటర్‌పై 50శాతం సబ్సిడీ, పిచికారీ పరికరాలు 33శాతం సబ్సిడీతో రైతులకు అందజేసేవారు. 2018 సంవత్సరం వరకు సబ్సిడీ కొనసాగింది. కొంత కాలంగా ఈ పథకం అటకెక్కింది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ మంత్రి రాయితీపై రైతులకు వ్యవసాయ ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు.

కూలీల కొరతను అధిగమించవచ్చు

వ్యవసాయ పనుల్లో యంత్రాలు వినియోగించడంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసే వీలుంటుంది. విత్తనాలు వేయడం మొదలు నుంచి పంట కోత వరకు అన్ని పనులు యంత్రాలతో సమయం ఆదా అవుతోంది. అంతేగాక కూలీల కొరతను అధిగమించవచ్చు. గ్రామాలలో వ్యవసాయ పనులకు కూలీలు లభించక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. అందుబాటులో ఉన్న కొద్దిమంది పనులకు వచ్చిన డిమాండ్ ఉండడంతో కూలీల చెల్లింపులో రైతులపై అధికభారం పడుతోంది. ఇప్పటికే రైతులు యంత్రీకరణపై ఆధారపడి ఉన్నారు. వరిపంటకు చేతికొచ్చే సమయంలో కూలీలు లభించక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరికోత యంత్రాలు కొనుగోలు చేయడం రైతులకు భారమవుతోంది. వరి కోత యంత్రాలు అద్దెకు తీసుకొని పనులు వెల్లదీస్తున్నారు. ప్రభుత్వం యంత్ర పరికరాలు, వరికోత యంత్రాలను సబ్సిడీపై అందిస్తే రైతుల ఇబ్బందులు దూరమవుతాయి.

వ్యవసాయ ఉత్పత్తులు ఆరబెట్టే యంత్రం

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌కు తరలించడంలో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు పంటలను ఎండబెట్టి మార్కెట్‌కు తరలించాల్సి ఉంటుంది. ఈ ధాన్యాన్ని, మొక్కజొన్నలను ఎండబెట్టడం రైతులకు కష్టంతో కూడుకున్న పని. ఇటీవల వ్యవసాయ ఉత్పత్తులను ఆరబెట్టే యంత్రం మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చింది. మూడు, నాలుగు రోజుల పాటు ఎండబెట్టాల్సిన ధాన్యం ఈ యంత్రం ద్వారా ఒక్క రోజుల్లోనే ఆరబెడుతుంది. ఇందుకు మిషన్‌కు అద్దె చెల్లించాల్సి ఉన్నపపటికీ రైతులకు శ్రమ తగ్గనుంది.

అందుబాటులో లేని వరినాటు యంత్రాలు

రైతులకు వరినాట్లు వేసే యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో కూలీలపై ఆధారపడాల్సి వస్తోంది. గ్రామాల్లో సైతం పొలం పనులకు కూలీలు లభించక వరినాట్లు వేసే పనులకు ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలే ఆసరా అవుతున్నారు. జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వస్తున్న కూలీలచే రైతులు నాట్లు వేయిస్తున్నారు. వరి నాట్ల యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తే రైతులకు ఎంతో ప్రయోజనకంగా ఉంటుంది.

రైతులకు పెట్టుబడి ఆదాకు అవకాశం

సబ్సిడీపై వ్యవసాయయంత్రాలు, పరికరాలు అందజేస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులుతగ్గి డబ్బులు ఆదా అవుతాయి. రోటోవేటర్ లాంటి పరికరాల వినియోగంతో భూమి గుల్లాగా మారి సారవంతమవుతుంది. పిచికారీ పరికరాలు (స్ప్రే) పంపులు రాయితీ ఇవ్వడంతో రైతులకు లాభం చేకూరుతోంది. సీడ్‌కం ఫర్టిలైజర్, డ్రీల్ వినియోగం ద్వారా విత్తన మోతాదు, ఎరువులు మోతాదు ఆదా అయి రైతులకు బహువిధ లాభా లు చేకూరుతాయి. దీనివల్ల వ్యవసాయ పెట్టుబడి ఖర్చు తగ్గించి రైతులకు నికర ఆదాయం పెంచడానికి వీలు కలుగుతుంది.





మొక్కజొన్న ఆరబెట్టే యంత్రం

ట్రాక్టర్ ద్వారా విత్తనాలు వేస్తున్న రైతు



ఘనంగా అంగారిక గణపతి పూజలు

- ఆలయాల్లో సామూహిక అర్చనలు
- గణపతి హోమాలు, అన్నదానాలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక అంగారిక గణపతి పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా గణపతి ఆలయాల్లో సంకష్టహర చతుర్థి పూజలు భక్తిశ్రద్దలతో సాగాయి. కార్తీకమాసానికి తోడు గణపతికి ప్రీతికరమైన మంగళవారం రోజున చతుర్థి రావడంతో ఆలయాల్లో గణపతికి అభిషేకాలు, విశేషపూజలు జరిపారు. ఉదయం ఆలయాల్లో గణపతి అధర్వన శీర్షంతో అభిషేకాలు నిర్వహించగా సాయంత్రం సామూహిక సంకష్ట పూజలు చేశారు. కొత్తగా సంకష్ట వ్రతాన్ని పాటించేవారు ఈ రోజున పాటిస్తే శ్రేష్టమని పండితులు పేర్కొనడంతో భక్తులు సంకష్ట వ్రతాన్ని పాటించారు. రాత్రి చంద్ర దర్శనం చేసుకొని ఉపవాసాన్ని విడిచారు. ఆలయాల్లో సంకష్ట చతుర్థిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలతోపాటు పలు ఆలయాల్లో గణపతి హోమాలు, సామూహిక సహస్ర గరిక పూజలు సాగాయి. ఆల యాల్లో రాత్రి సంకష్ట వ్రతాన్ని పాటించే భక్తులకు అన్నప్రసాదా న్ని అందజేశారు. జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ గణపతి క్షేత్రంగా విరాజిల్లుతున్న సార్వజనిక్ గణేష్ ఆలయం, పద్మానగర్‌లోని సిద్ధి వినాయక ఆలయం, మారుతీనగర్‌లోని మహాగణపతి ఆలయం, బోర్గాం(పి)లోని లక్ష్మి గణపతి ఆలయం, బొడ్డెమ్మ చెరువు వద్ద గల మహాగణపతి ఆల యం, బ్రహ్మపురిలోని వరసిద్ధి వినాయక ఆలయం, గూపన్‌పల్లి గణపతి ఆలయాల్లో ఘనంగా సంకష్ట పూజల నిర్వహించారు.



గణపతి ఆలయంలో మూలవిగ్రహం



ఆలయంలో సామూహిక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తుల కొంగుబంగారం

సంగమేశ్వరుడు

- పేట్ సంగెం ఆలయానికి అపూర్వ చరిత్ర
- భక్తుల కోరికలు తీర్చుతున్న స్వామివారు
- ప్రతీ సోమవారం ప్రత్యేక పూజలు

భక్తి



పేట్‌సంగెంలోని సంగమేశ్వరుని ఆలయం

గాంధారి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైందవ సంప్రదాయంలో సంతానం కలిగిన స్త్రీ జీవితం పరిపూర్ణతరిగా భావిస్తారు. అంటే స్త్రీ మరో జీవికి జన్మనివ్వాలని అర్థం. అలాంటి ధన్య జీవిగా స్త్రీని మార్చే దేవతగా గాంధారి మండలంలోని పేట్‌సంగెం గ్రామంలో వెలిసిన సంగమేశ్వరుడిని పిలుస్తారు. ఈ ఆలయం చాలా పురాతనమైనది. బ్రిటిష్ పాలనలో ఈ ప్రాంతం నిజాంపాలకు ఆధీనంలో ఉండేది. ఆ సమయంలోనే సంతాన ప్రదాతగా వెలుగొందిన సంగమేశ్వరుడి ప్రతిష్టతను దెబ్బతియాలని అధికారంలో ఉన్న నిజాం నవాబులు పథకం వేసి ఆలయంపై దాడి చేయడంతో ఆలయం ముందున్న బసవన్న విగ్రహం ధ్వంసమైనట్లు చరిత్ర చెబుతోంది. ఇప్పటికీ ఈ ప్రాంత ప్రజలతోపాటు సరిహద్దు రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్రలోని పలు గ్రామాల ప్రజలు సంగమేశ్వరుని ఆరాధించి సంతానాన్ని పొందుతున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న చిలువ, పత్రాలు, ఇతర చెట్ల ఆకులతో తయారుచేసిన మందును సేవించిన సంతానం కలుగుతుందని, స్త్రీలు సంతానం పొందగలరని సంగమేశ్వరుడిపై నమ్మకం ఉన్న వారంతా భావిస్తారు. సంగమేశ్వరుడి ఆశీర్వాదంతో సంతానం పొందిన వారంతా దేవుని వర ప్రసాదంతో సంతానం పొందిన వారు ఇక్కడే పుట్టువెంట్రులు తీస్తుంటారు. ప్రతీఏటా హనుమన్ జయంతి రోజున రెండురోజుల పాటు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. పూర్వం సంగమేశ్వర ఆలయానికి పేట్ సంగెం గ్రామానికి చెందిన పూర్వంతి లక్ష్మన్ అనే గ్రామపెద్ద గ్రామంలో తిరిగి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభించినట్లు ప్రచారం ఉంది. బ్రహ్మోత్సవాల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన వ్రతంపై దేవుడిని ఊరేగిస్తారు. ఈఆలయాన్ని దేవాదాయశాఖ అభివృద్ధి పరిస్తే మరింత ప్రచురణ పొందే అవకాశం ఉంది.



గర్భగుడిలో సంగమేశ్వరుడు విగ్రహం

గ్రామంలో సగం పేర్లన్నీ స అక్షరంతోనే..

పేట్‌సంగెం గ్రామంలో సగం మంది పేర్లు స అనే అక్షరంతోనే పిలుస్తుంటారు. వారి పిల్లలకు దేవుడిపై ఉన్న భక్తితో సంగమేశ్వరుడి మొదటి అక్షరం స ప్రారంభయ్యేటట్లు పలుకుతుంటారు. ఈ గ్రామాలలో సగం అక్షరంపైనే ఉండడం గమనార్హం.

ప్రతీ సోమవారం ప్రత్యేక పూజలు

- సంగయ్య, మాజీ సర్పంచ్

సంగమేశ్వరుడి ఆలయం దర్శనానికి ప్రతీ సోమవారం చుట్టు పక్కల గ్రామాల నుండి ఇక్కడికి రావడం ఆనవాయితీ. ఇక్కడ మొక్కిన మొక్కులు నెరవేరుతాయని ప్రతి ఒక్కరికి నమ్మకం అందుకే సంగమేశ్వరుడి ఆలయాన్ని దర్శించుకుంటారు.

పశువులకు గాలి కుంటువ్యాధి పట్ల

అప్రమత్తత అవసరం

తెలుసుకుందాం



గాలికుంటు వ్యాధి సోకిన పశువునోట్లో ఏర్పడిన పుండ్లు



పశువుకాలి గిట్టల మధ్య ఏర్పడిన పుండ్లు

కమ్మర్‌పల్లి, నవంబరు 19: (ఆంధ్రజ్యోతి): సీజనల్‌గా పశువులకు వ్యాపించే గాలికుంటు వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎంతమాత్ర నిర్లక్ష్యం చేసినా పశువులు ప్రమాదాల బారిన పడతాయని కమ్మర్‌పల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేశ్వర్‌రావు సూచించారు. దేశవాళి పశువుల కన్నా సంకరజాతి పశువుల్లో గాలికుంటు వ్యాధి లక్షణాల తీవ్రత అధికంగా ఉంటుందని చెప్తున్నారు. దేశవాళిపశువులకు ప్రాణనష్టం అంతా ఉండదు. ప్రతీ సంవత్సరం మార్చ్, ఏప్రిల్ మాసాలతోపాటు ఆగస్టు మాసంలో ఈ వ్యాధి పశువులకు ఎక్కువగా సోకుంతుందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు గమనిస్తు పశువైద్యాధికారుల సుచనలు సలహాలు పాటిస్తు తగు చిక్సిలు చేయించుకోవాలని సూచించారు. గాలికుంటు వ్యాధి సికోర్న కుటుంబానికి చెందిన అస్త్రోస్ వైరస్‌వల్ల పశువులకు సోకుతుందన్నారు.

వ్యాధి లక్షణాలు..

పశువులకు 103 నుంచి 106 ఫారెన్‌హిట్ మెర జ్వరం సోకుతుంది. దీంతో పశువుల నోట్లో, చిగుళ్లపై పొక్కులు వస్తాయి. ఈ కారణంగా అవి మేత లేక ఆకలితో అలమటిస్తాయి. నీళ్లు సైతం తాగే అవకాశం లేకపోవడంతో అవి నీరసించిపోతాయి.

- ఈ వ్యాధి సోకిన పశువులకు నోరు, కాలిగిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. రెండు మూడు వారాల్లో బొబ్బలు చితికి పుండ్లుగా మారుతాయి.
- నోట నుంచి చొంగ కారుతుంది, పాల ఉత్పత్తి పూర్తి స్థాయిలో తగ్గిపోతాయి.
- గిట్టల మధ్య ఏర్పడిన పుండ్ల కారణంగా ఎడ్లు వ్యవసాయపనులు చేయలేవు.
- గాలికుంటు వ్యాధి సోకిన ఆవులు, గేదెల పాలు తాగిన దూడలు అనారోగ్యానికి గురై మృత్యువాతపడే అవకాశాలు ఉంటాయి.

వ్యాధి నివారణ చర్యలు

- గాలికుంటు వ్యాధి సోకిన పశువులను మందలో కాకుండా వేరుగా కట్టేయాలి.
- పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచాలి. ఎప్పటికప్పుడు క్రిమిసంహారక మందులు వాషింగ్ సోడా కలిపి శుభ్రం చేయాలి.
- ఒకవేళ వ్యాధి ముదిరి మరణించిన పశువును సున్నపు గోతిలో పూడ్చిపెట్టాలి.
- వ్యాధి సోకిన పశువు పాలను గేదెలకు తాగించవద్దు. అలా చేస్తే వ్యాధి దూడలకు సోకి తక్కు సమయంలోనే అవి మృత్యువాత పడే అవకాశాలు ఉంటాయి.
- వ్యాధి సోకిన, సోకని పశువుశుకు సైతం ముందస్తుగా మార్చ్, ఏప్రిల్ మాసాలతోపాటు ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

చికిత్స విధానం

- వ్యాధి సోకిన పశువు కాలి గిట్టల మధ్య ఏర్పడే పుండ్లను పోటాశియం పర్మాగనేట్ ద్రవంతో శుభ్రం చేయాలి. ఈగలు వాలకుండా పుండ్లపై వేప నూనె రాయాలి.
- ఈ వ్యాధి వల్ల పశువు నోట్లో ఏర్పడిన పుండ్లకు గ్లీసరీన్, బోరిక్ పైడర్‌ను కలిపి రాయాలి.
- వ్యాధి సోకినట్లు గుర్తించిన తక్షణమే సంబంధిత పశువుల వైద్యశాలకు వచ్చి అవసరమైన ఎంటిబూటిక్, నొప్పుల మందులువాడాలి.



వ్యాధి సోకిన పశువు నోట్లో చిగుళ్ల మధ్య ఏర్పడిన వాపు



వ్యాధి సోకిన పశువు నోటి నుంచి కారుతున్న సొంగ



పశువు నాలుకపై ఏర్పడిన బొబ్బలు

అంతటా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

వినియోగదారులకు మెరుగైన రక్షణ : ధన్‌పాల్



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):కేంద్రంలో బీజెపి అధికారంలోకి వచ్చి ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేసిన తర్వాతనే వినియోగదారుల కోసం చట్టంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలో మంగళవారం జరిగిన సిసిఐ జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వినియోగదారుల కోసం రకరకాల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా కన్స్యూమర్‌ఫోరంను ఏర్పాటు చేయడంతో పాటు కల్తీ వస్తువులు అమ్మేవారిపైన కఠిన చర్యలు తీసుకునే విధంగా చట్టాలు చేశారని ఆయన అన్నారు. డిజిటల్ ఇండియా లక్ష్యంతో ప్రతీ ఒక్కరు ముందుకు సాగే విధంగా ప్రధాని మోదీ మేకిన్ ఇండియా నినాదంతో ముందుకు పోతున్నారని అన్నారు. ఈ సమావేశంలో నగర అదనపు కమీషనర్ శంకర్, వినియోగ దారులకు సంబంధించిన సిసిఐ జాతీయ అధ్యక్షుడు ప్రీతిపాండ్యా, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్, జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రవీణ్, వర్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్: నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ చెక్కులను ధన్‌పాల్ సూర్యనారాయణ లబ్ధిదారులకు మంగళవారం అందించారు. దరఖాస్తు చేసిన మూడు నెలల్లోనే లబ్ధిదారులకు చెక్కులు అందే విధంగా చూస్తున్నామని ఆయన తెలిపారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి


శేఖర్‌ను పరామర్శిస్తున్న చెన్నయ్య

సుభాష్‌నగర్,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూకిరణ్ భర్త శేఖర్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో దండు శేఖర్‌ను పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత నాయకుడిపై హత్యాయత్నం చేయడం బాధాకరమన్నారు. దళిత నాయకుల ఎదుగుదలను చూసి ఓర్వలేకనే భౌతిక దాడులకు పాల్పడుతున్నారని అన్నా రు. భౌతిక దాడులను పాల్పడుతున్న దుండగులను కఠినంగా శిక్షించి సమగ్ర విచారణ చేయాలన్నారు. దాడి వెనుక ఉన్న వారందరిని శిక్షించాలన్నారు. నింధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూర్గుల వెంకటేశ్వర్లు, అలుక కిషన్, ఎల్లం, నాగరాజు, అంగిరి ప్రదీప్, నీలగిరి రాజు, వినయ్, స్వామిదాసు, సుశీల్‌కుమార్, దేవిదాసు, తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా:దళిత నాయకుడిపై దాడి చేసిన వ్యక్తిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు ప్రతినిధులు మంగళవారం ఇంచార్జీ సీపి సింధూశర్మకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, ఎడ్లనాగరాజు, బూర్గుల వెంకటేశ్వర్లు, అనాంపల్లి ఎల్లం, అలుక కిషన్, ప్రదీప్, నీలగిరిరాజు, నాంది వినయ్, స్వామిదాస్, సుశీల్‌కుమార్, బాలరాజు, తదితరులు ఉన్నారు.

ఖిల్లా:బీఆర్ఎస్ సీనియర్ నేత నగరపాలకసంస్థ మేయర్ భర్త దండు శేఖర్‌పై దాడి చేసిన వ్యక్తిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ నిజామాబాద్ ఏసీపీ రాజవెంకటరెడ్డికి మంగళవారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు.ఏసీపిని కలిసిన వారిలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు సిర్పరాజు, నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నీలగిరి రాజు, గాండ్ల లింగం తదితరులు ఉన్నారు

మేయర్ భర్తపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

- హత్యాయత్నం కేసు నమోదు


నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

ఖిల్లా, నవంబరు19(ఆంధ్రజ్యోతి):మేయర్ భర్త, సీనియర్ బీఆర్ఎస్ నేత దండుశేఖర్‌పై సోమవారం దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన వ్యక్తి శేఖ్ రసూల్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఐదవ టౌన్ ఎస్ఐ గంగాధర్ తెలిపారు.ఆయన దాడికి ఉపయోగించిన సుత్తి, సెల్‌ఫోన్, ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని అన్ని కోణాల్లో నార్త్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మాక్లూర్ ఎస్ఐ రాజశేఖర్‌ల నేతృత్వంలో విచారణ జరుపుతున్నామన్నారు. దాడిపై మేయర్ దండు నీతుకిరణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయడం జరిగిందన్నారు. ఒక ప్లాట్ విషయంలో గత కొంతకాలంగా బాధితుడి అనుచరులైన గోపాల్, తిరుపతిలతో గొడవ పడేవాడని ఫిర్యాదులో వారు పేర్కొన్నట్లు తెలిపారు. 2021లో దాడి చేసిన వ్యక్తి గోపాల్, తిరుపతిలపై పోలీసులకు ఫిర్యాదు చేశాడని ఆఫిర్యాదులో తెలిపారన్నారు. గతంలోనే వీరందరిని హత్య చేస్తానని రసూల్ హెచ్చరించిన విషయమై పూర్తిగా విచారణ చేయడం జరిగిందన్నారు. ఖచ్చితమైన సమాచారం మేరకు దాడిచేసిన వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.


నగరంలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


బోధన్‌లో..


నందిపేటలో..


నవీపేటలో ..


డొంకేశ్వర్‌లో..


ఆర్మూర్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ 107వ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి తదితరులు కాంగ్రెస్ భవన్‌లో ఆమె చిత్రపటానికి అనంతరం నగరంలోని పూలాంగ్‌లోగల ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని ఆమె చేసిన అభివృద్ధి పనుల వల్లే దేశం ప్రస్తుతం ఈ ఉన్నత స్థితిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, ప్రీతం, బొబ్బిలి రామకృష్ణ, రేవతి, వినయ్, ప్రమోద్, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం భారతదేశ తొలి మహిళ దేశ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందిరాగాంధీ భారతదేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ శివలింగు శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల అశోక్, బీజేపీ అధ్యక్షుడు జక్కం అశోక్, ఎఎంసీ డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి, మాజీఎంపీపీ గిర్మాజీగంగాధర్, జైడి చిన్న గంగారాం, కుదురుపాక ప్రవీన్, కడపాటి రాజేశ్వర్, జైడి పెద్ద గంగారాం, కడపాటి రమేష్, నజీర్, శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నవీపేట: భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 107వ జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సిరికొండ: మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను సిరికొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించుకున్నారు. తెలంగాణ చౌరాస్తాలో ఇందిరాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాకారం రవి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయన్న, రమేష్, బాకారంసంతోష్, ఎర్రన్న, నర్సారెడ్డి, శోభన్,మహేష్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, సురేష్, రాజరెడ్డి,సంతోష్‌నాయక్, బల్‌రాం నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ముత్తెన్న, సంపత్‌రెడ్డి, మల్లేష్, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్ మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ప్రతి మహిళ ఇందిరమ్మను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరికాంత్ చారి, మారుతీ మందిరం ఛైర్మన్ గుండెంటి శంకర్, సంగ్రామ్, ఉర్దూఘర్ ఛైర్మన్ బ్యాటరీ బాబా, కౌన్సిలర్ జావీద్, కలీం, చిరంజీవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా వద్ద ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మారంపల్లి ఛైర్మన్ బోజారెడ్డి, దత్తాపూర్ లిఫ్ట్ ఛైర్మన్ రమణ, కాంగ్రెస్ నాయకులు శ్యామ్‌గౌడ్, హరిదాస్; అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ సాయిబాబాగౌడ్, పండిత్ పవన్, కొంతం మురళీధర్; పూల్ నర్సయ్య, అజ్జు, ఫయాం, శెట్‌పల్లి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నంది పేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ 107వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఆర్మూర్ నియోజకవర్గం ఇంచార్జీ వినయ్ రెడ్డి ఆదేశాల మేరకు ఆమె చిత్ర పటానికి పూలమాల వేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, మాజీ ఎంపీటీసీ సభ్యులు దూడ వెంకటేష్, మైనార్టీ అధ్యక్షులు యూసుఫ్, నాయకులు మాన్పూర్ భూమేష్, లింగం, జమీల్, ఉన్నారు.

డిచ్‌పల్లి:భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి ని మంగళవారం ఖిల్లా డిచ్‌పల్లిలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆమె విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్ గ్రామంలో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగ నివాళ్లర్పించారు. అనంతరం స్వర్గీయ ఇందిరాగాంధీ పేదలకు అందించిన సేవలు పథకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటి ఛైర్మన్ పాలెపు నర్సయ్య, జిల్లా నాయకులు తదితర నాయకులు పాల్గొన్నారు.

మేయర్ భర్త శేఖర్‌పై దాడిని ఖండిస్తున్నాం

- దాడి వెనకాల ఉన్న నిందితులను వెంటనే శిక్షించాలి
- బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో శాంతిభద్రతలకు విఘాతం కలగలేదు
- నిందితులపై చర్యలు లేకపోతే ఆందోళనలు చేస్తాం
- నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త


ఆసుపత్రి ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా

సుభాష్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ మేయర్ దండు నీతూ కిరణ్ భర్త శేఖర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని నిందితులను వెంటనే శిక్షించాలని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త డిమాండ్ చేశారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శేఖర్‌ను బిగాల గణేష్‌గుప్త పరామర్శించారు. కన్నీటి పర్యంతమైన నగర మేయర్ నీతూకిరణ్‌ను ఓదార్చారు. వైద్యులను కలిసి శేఖర్‌కు అందిస్తున్న వైద్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నగర మొదటి మహిళా అయినటువంటి మేయర్ భర్తపై హత్యాయత్నం జరగడం బాధాకరమన్నారు. పది సంవత్సరాల పాలనలో తెలంగాణ అభివృద్ధి జరిగిందని ప్రజలు అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లాలో అభివృద్ధితో పాటు శాంతిభద్రతల విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్ని జాగ్రత్తలు తీసుకుందో ప్రజలు గమనించాల్సిన అవసరం ఉందన్నారు. మేయర్ కుటుంబానికే రక్షణ లేకపోతే నగరంలో గానీ, రాష్ట్రంలో గానీ రక్షణ ఉందా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దండు శేఖర్ ఆయన డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ కోసం వెళితే ఓ వ్యక్తి వచ్చి దారుణంగా ఆయనపై దాడి చేయడం వ్యవస్థలో ఇలాంటివి తగునా అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించింది దాడులు చేయడం కోసమేనా అని అన్నారు. మేయర్ కుటుంబంపై దాడి చేస్తే ప్రజలందరూ భయభ్రాంతులకు గురవుతారనే దురాలోచనతో చేసిన ఈ నీచమైన పని ఈ దాడి అని అన్నారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ నగరాన్ని అభివృద్ధితో పాటు శాంతిభద్రతలతో నడిపించామని అన్నారు. నగర మేయర్ ఒంటరి కాదని ఎవరైనా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై దాడి జరిగితే పార్టీ ఊరుకోదని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి విషయంలో ఈ ప్రభుత్వాన్ని పోటీ పడాలని భౌతిక దాడులు, మర్డర్లు, రైతుల మీద దాడులు చేయడం లాంటి పనులు ఈ ప్రభుత్వం చేస్తుందన్నారు.ప్రభుత్వాన్ని పోలీసు వ్యవస్థను కోరేది ఒక్కటేనని ఇక్కడ రాజకీ యాలు వద్దని రాజకీయాలు చేసుకోవడానికి చాలా విషయాలు ఉన్నాయని అన్నారు.రాజకీయా లకు మే ము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని ప్రజల కోసం ప్రభుత్వం ఏం వెలగబెడుతుందో దాని గురించి మాట్లాడుకుందామన్నారు. మేము మర్డర్లు చేస్తాం, నిజామాబాద్ నగర ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తామంటూ ఉంటే ఇక్కడ చట్టం ఎవరికి చుట్టం కా దన్నారు. ఖచ్చితంగాదాడి వెనుక ఎవరిహస్తం ఉన్నావారందరిని శిక్షిం చా ల్సిందేనని పోలీసు వారిని కోరారు.అవసర మైతే ధర్నాలకు పిలు పునిస్తామన్నారు. పార్టీ పరంగా మేయర్ కు టుంబానికి అండగా ఉం టామన్నారు. భావి వాదాలు ఏమైనా ఉం టే చట్టపరంగా పరిష్క రించుకోవాలని తెలిపా రు. హత్యలను ప్రోత్స హించ రాదన్నారు. అధికా రం ఎవరికి శాశ్వతం కాదని అధికారంలో ఉన్నా మని దాడులుచేస్తే శాంతిభద్రతలు ఉండవన్నారు. దాడుల సం స్కృతి నిజామాబాద్‌లో ఉండకూడదని అన్నా రు. ఆయన వెంట సిర్ప రాజు, ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, మురళి, తదితరులు ఉన్నారు.

జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర సర్వే

(ఐదో పేజీ తరువాయి)

వివరాలను ఇవ్వడం లేదు. మరికొంత మంది పార్టీకి సంబంధించిన వివరాలను తెలపడం లేదు. గడువు దగ్గర పడుతుండగా ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరుగుతూ కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాలను నమోదు చేస్తున్నారు. కుటుంబ యజమాని సంతకాలను తీసుకుంటున్నారు.

21న దివ్యాంగ బాల బాలికల ఆటల పోటీలు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున జిల్లాలోని 10-17 సంవత్సరాలలోపు దివ్యాంగ బాల బాలికలకు, 18-54 సంవత్సరాలలోపు దివ్యాంగులకు వేరు వేరుగా జిల్లాస్థాయి ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని షేక్ రసూల్‌బీ ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలోని దివ్యాంగులు ఈ ఆటల పోటీలో పాల్గొనాలని ఆసక్తిగల వారు ఈనెల 21న ఉదయం 9గంటలకు జిల్లా క్రీడామైదానం (పాత కలెక్టరేట్ గ్రౌండ్)నిజామాబాద్‌కు హాజరుకావాలని ఆమె తెలిపారు. క్రీడాపోటీల్లో పాల్గొనేవారు తప్పనిసరిగా సదరం వైద్య ధ్రు వపత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

డీఈవోను కలిసిన టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం

నిజామాబాద్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం మంగళవారం జిల్లా విద్యాశాఖ అధి కారి అశోక్, విద్యాశాఖ కార్యాలయ సిబ్బందిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈవోను సన్మానించారు. డీఈవోను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్, ప్రధాన కార్యదర్శి పూదరి అర్విండ్, గంగా ప్రసాద్, తది తరులు పాల్గొన్నారు.

లగచర్లలో గిరిజనులపై అన్యాయంగా కేసులు

ధర్పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):లగచర్ల ఘటనలో గిరిజను లను అన్యాయంగా అరెస్టు చేశారని నిజామాబాద్ జిల్లా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు గోపాల్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ ఫార్మా కంపెనీ కోసం గిరిజనుల భూ ములను లాక్కోవడం ఎంతవరకు సమంజస మని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమ భూములను అన్యాయంగా ప్రభుత్వం లాక్కుంటే గిరిజనులు అడ్డుకుంటే వారిపై అన్యాయంగా కేసులు పెట్టి ప్రభుత్వం నానా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబును కలిసిన దేగాం యాదాగౌడ్


చంద్రబాబునుతో దేగాం యాదాగౌడ్

సుభాష్‌నగర్,నవంబరు19(ఆంధ్ర జ్యోతి):ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడును టీడీపీ జిల్లా అడ హక్ కమిటీ కన్వీనర్ దేగాం యాదాగౌడ్ కలిశారు. ఇటీవల చంద్రబాబు నాయుడుతమ్ముడు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయు డు మరణించడంతో తన స్వగృహమైన నారవారి పల్లెలో కలిసి చంద్రబాబును పరామర్శించారు. ఆయన వెంట జిల్లా టిడిపి నాయకులు తదిత రులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల

నిజామాబాద్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి సంబంధించి 2024-25 సంవత్సరానికి గాను పెండింగ్ మరియు రెగ్యూలర్ బిల్లుల కోసం నిధులు విడుదల చేసినట్లు జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. సిసిహెచ్‌ల గౌరవ వేతనం రూ.2వేలకు గాను రూ.కోటి 31లక్షల 24వేల మండలాల వారిగా రిలీజ్ చేశారని కావున త్వరలోనే బిల్లులు సిసిహెచ్ ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూపీడీఎస్‌యూ అధ్వర్యంలోమంగళవారం నగరంలోని మహిళాపాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్స్, దేవిక, రాహుల్, సాయికిరణ్, రాజు, పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.190	రూ.270	రూ. 295
వెన్‌కాబ్(కిలో)	: రూ.200	రూ.280	రూ. 305



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78500	రూ.72500	రూ.955


సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కంగువా (తెలుగు) (11.50, 3.15, 6.40, 10.10)
స్క్రీన్-2 : గ్లాడియేటర్-2 (తెలుగు) (12.10)
: మట్కా (3.35, 7.00)
: క (10.25)
స్క్రీన్-3 : అమరన్ (11.45, 3.15, 6.50)
: లక్కీ భాస్కర్ (10.25)
స్క్రీన్-4 : క (1.00)
: లక్కీ భాస్కర్ (4.15)
: గ్లాడియేటర్-2 (ఇంగ్లీష్) (7.30)
: అమరన్ (10.45)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అమరన్ (10.30, 4.25, 10.30)
: లక్కీ భాస్కర్ (1.30, 7.40)
స్క్రీన్-3 : కంగువా (10.30, 4.30, 10.40)
: అమరన్ (1.30, 7.30)



దేవి : మట్కా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కంగువా (3డి తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహోల్ : లక్కీ భాస్కర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్